కేటీఆర్‌ను కలిసిన నవాజ్

ముస్తాబాద్, ఏప్రిల్ 15: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు ఎండీ నవాజ్ తన పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవాజ్‌కు కేటీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో నవాజ్

'పైసా వసూల్' బాధ్యులపై చర్యలు

- యూనియన్ నేతల విచారణ
- 'నమస్తే' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఐసీడీఎస్‌లో టీచర్లుగా ప్రమోషన్ పొందిన కొందరు ఆయాల వద్ద యూనియన్ నాయకుల పేరిట డబ్బులు వసూలు చేసినట్లు తేలితే చర్యలుంటాయని జిల్లా సంక్షేమాధికారి పోచంపల్లి లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న ఐసీడీఎస్‌లో 'పదోన్నతుల పేరిట పైసా వసూల్' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి స్పందించి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అంగన్‌వాడీ ఖాళీలను గుర్తించి అందులో పని చేసిన అర్హత గల ఆయాల నుంచి దరఖాస్తులను స్వీకరించి 45 ఏండ్ల లోపు వయసు అనుభవం ఉన్న గ్రామస్తులకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. ఎవరూ కూడా పదోన్నతి కోసం డబ్బులు అడిగితే ఇవ్వవద్దన్నారు. ఎవరైనా డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ అయితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 15: జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆర్థిక సాయంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన క్రీడల అధికారి అజ్మీరా రాందాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 1 నుంచి 31 వరకు 14 ఏండ్ల లోపు వయసు కలిగిన బాలబాలికలకు ఈ వేసవిలో వివిధ క్రీడా శిక్షణ శిబిరాలు (నాన్ రెసిడెన్సియల్) నిర్వహించడానికి ఉత్సాహవంతులైన సీనియర్ క్రీడాకారులు/ జాతీయ క్రీడాకారులు/ వ్యాయామ ఉపాధ్యాయులు ఈ నెల 22లోగా కలెక్టరేట్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం నంబర్లలో (9440239783, 7569207411) సంప్రదించాలన్నారు.

నీటి బొట్టును ఒడిసిపట్టాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని ఎంపీడీవో సత్తయ్య సూచించారు. మంగళవారం దేవుని గుట్టతండాలో వాటర్‌షెడ్ యాత్రను ప్రారంభించారు. చెక్‌డ్యాంలు, నీటి కుంటల ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ తీశారు. అలాగే బాకుర్‌పల్లితండాలో వాటర్ షెడ్ అభివృద్ధి పనులకు కృషి చేసిన అజ్మీరా రాజును సత్కరించి ప్రశంసా పత్రం అందించారు. ఇక్కడ ఏఎంసీ చైర్ పర్సన్ సాబేరాబేగం, ఏపీవో కొమురయ్య, శ్రీహరి, చంద్రయ్య ఉన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

బోయినపల్లి రూరల్, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రజిత మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఇక్కడ వైద్యాధికారి రేణు ప్రియాంక, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని క్లబ్ భవనంలో ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు కోట సతీశ్ తెలిపారు. మంగళవారం 126 మంది చికిత్స కోసం హాజరు కాగా, 31 మందికి మోతెబిందు ఆపరేషన్ అవసరాన్ని గుర్తించి రేకుర్తికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇక్కడ క్లబ్ సభ్యులు నాయిని భాస్కర్‌రెడ్డి, రావుల లింగారెడ్డి, పయ్యావుల రామచంద్రం, నంది కిషన్, సద్ది లక్ష్మారెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల కిష్టారెడ్డి, కొలనూరి శంకర్, వంగాల రవీందర్, కొండాపురం బాల్‌రెడ్డి, గొర్రె మల్లేశ్, దేవయ్య, ముత్యంరెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మణ్, సాంబశివరావు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లిలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, నేతలు

ఎల్లారెడ్డిపేట: ఫంక్షన్‌హాల్‌లో సమావేశమైన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, పార్టీ శ్రేణులు

రజతోత్సవ సభను సక్సెస్ చేద్దాం

- జిల్లా నుంచి వేలాది సంఖ్యలో తరలివెళ్దాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

వీర్నపల్లి: సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

వీర్నపల్లి, ఏప్రిల్15: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి వేలాది మంది కార్యకర్తలు, ప్రజలతో స్వచ్ఛందంగా తరలివెళ్లి విజయవంతం చేద్దామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి చలో వరంగల్ వాల్ పోస్టర్లను అవిష్కరించి, మాట్లాడారు. స్వరాష్ట్ర సాధనకు ఉద్యమించిన పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. ఇంటి పండుగలా జరిగే సభకు అందరూ సంసిద్ధం కావాలన్నారు. దారులన్నీ ఎల్కతుర్తి వైపే సాగేలా భారీగా జనాలను సమీకరించాలన్నారు. ఇక్కడ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, యువజన విభాగం మండలాధ్యక్షుడు సామల్ల దేవరాజు, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ సురేశ్‌నాయక్, నాయకులు అందె సుభాష్, ప్రభాకర్, రఫీ, శ్రీరాంనాయక్, నాగరాజు, ఉస్మాన్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు దిశానిర్దేశం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభను సక్సెస్ చేద్దామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అలాగే మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ కొండూరి గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాష్, గుళ్లపల్లి నర్సింహారెడ్డి, కొండ రమేశ్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు ఎద్ల సందీప్, అఫ్సరున్నీసా, మురళీమోహన్, సుధాకర్‌రావు, తదితరులు ఉన్నారు.

వేలాది మందితో తరలివెళ్దాం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 15: బీఆర్‌ఎస్ రజతోత్సవ తంగళపల్లి మండలం నుంచి రెండు వేల మంది కార్యకర్తలు, ప్రజలతో తరలివెళ్లి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ పిలుపునిచ్చారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం చలో వరంగల్ వాల్ పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రజల పార్టీ అని, తెలంగాణ తెచ్చిన పార్టీ అని స్పష్టం చేశారు. ప్రాణాలు పణంగాపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్.. పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగెల మానస, పీఏసీఎస్ చైర్మన్లు బండి దేవదాస్‌గౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, నాయకులు పడిగెల రాజు, మాట్ల మధు, వలకొండ వేణుగోపాలరావు, చంద్రరావు, గుగ్గిళ్ల అంజయ్య, ఏసీరెడ్డి రాంరెడ్డి, బండి జగన్, అవునూరి వెంకటరాములు, సిలువేరి చిరంజీవి, క్యారం జగత్, వేముల శ్రీనివాస్, రమేశ్, అనిల్, అమర్‌రావు, ప్రేమ్‌కుమార్, అఫ్రోజ్, నక్క కొమురయ్య, సిద్ధన్న, నవీన్‌రావు, తిరుపతిరెడ్డి, కిష్టారెడ్డి, చక్రపాణి, భానుమూర్తి ఉన్నారు.

ప్రతి ఊరు నుంచి తరలిరావాలి

ముస్తాబాద్, ఏప్రిల్ 15: రజతోత్సవ సభకు ప్రతి ఊరు నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17న మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు నివాసంలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామల అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు సర్వర్‌పాషా, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏద్దండి నర్సింహారెడ్డి, మహిళా అధ్యక్షురాలు మెంగని బాల్‌లక్ష్మి, మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి, నాయకులు చెవుల మల్లేశం, అన్వర్, మెంగని స్వర్ణలత, గుండెల్లి రాములు ఉన్నారు.

ముస్తాబాద్: పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

రాజన్న సిరిసిల్ల జడ్జి బదిలీ

గాంధీ చౌక్, ఏప్రిల్ 15: రాజన్న సిరిసిల్ల జడ్జి ఎన్ ప్రేమలతను గద్వాల జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టు జిల్లా జడ్జి పీ నీరజ నియమితులయ్యారు. సిరిసిల్ల మొదటి అదనపు జిల్లా జడ్జిగా బీ పుష్పలతను నియమించారు.

ప్రజలకు మరింత చేరువకావాలి: ఎస్పీ

ముస్తాబాద్/ గంభీరావుపేట, ఏప్రిల్ 15: ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ మహేశ్ బి గితే పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తొలిసారి మంగళవారం ఆయన ముస్తాబాద్, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. తర్వాత గంభీరావుపేట మండలం నర్మాలలోని ఎగువమానేరు ప్రాజెక్టును సందర్శించారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్లలో రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు మొగిలి, శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ ప్రేమానందం, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఆర్మీలో నియామకాలకు ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఇండియన్ ఆర్మీలో నియామకం కోసం ఔత్సాహిక అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25లోగా వెబ్‌సైట్‌లో (www.joinindianarmy.nic) దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. సలహాలు సూచనల కోసం సికింద్రాబాద్‌లోని రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నంబర్ (040-27740205) సంప్రదించాలని సూచించారు.

మాజీ సర్పంచ్ మృతి

ఇల్లంతకుంట రూరల్, ఏప్రిల్15: పెద్దలింగాపూర్ మాజీ సర్పంచ్ కేతిరెడ్డి రాంరెడ్డి (95) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. రాంరెడ్డి పెద్దలింగాపూర్ గ్రామ మొట్టమొదటి సర్పంచ్‌గా 1958 నుంచి 1968 వరకు పదేండ్లపాటు బాధ్యతలు స్వీకరించారు. రాంరెడ్డి మృతి తీరని లోటు అని గ్రామస్తులు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి, ఏప్రిల్ 15: దొంగతనాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మర్రిగడ్డలో ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో సమస్యవస్తే డయల్ 100కి కాల్‌చేయాలన్నారు. ఇక్కడ ఎస్ఐ అంజయ్య ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

వేములవాడ, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వేములవాడ అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్ అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇక్కడ హెచ్ఎం రాజారత్నం, టీచర్లు ఉన్నారు.

చిత్రకారుడికి సన్మానం

వేములవాడ, ఏప్రిల్ 15: ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా మంగళవారం వేములవాడ న్యూ అర్బన్ ప్రాథమిక పాఠశాల ప్రముఖ చిత్రకారుడు ఇందూరి మధును హెచ్ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ సన్మానించారు. ఇక్కడ ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు లిక్కిడి మంజుల, పులి శారద ఉన్నారు.

సంఘాలు-కార్యవర్గాలు

చందుర్తి, ఏప్రిల్ 15: మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్ధం తిరుమల్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా దూది శ్రీనివాస్ రెడ్డి, దారం బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎడమల ఆదిత్యరెడ్డి, కూతురు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పూడూరి ప్రశాంత్‌రెడ్డి, కార్యదర్శిగా నాయిని బాపురెడ్డి, ప్రధాన సలహాదారులుగా బాణాల మల్లారెడ్డి, అంచె శ్రీహరిరెడ్డి, ఏరెడ్డి వెంకట్‌రెడ్డి, హనుమంతరెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

కోనరావుపేట, ఏప్రిల్ 15: మండల కేంద్రంలో మండల శ్రీ సీతా రామాంజనేయ కళామండలి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనగర్తి గ్రామానికి చెందిన పోగుల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పాలకుర్తి శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి శంకర్, కోశాధికారిగా యెల్ల రాంరెడ్డి, ప్రధాన సలహాదారుడిగా నాయిని ప్రభాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బడుగు నర్సింగం, బడే గంగారాం, ఈర్ల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

చందుర్తి, ఏప్రిల్ 15: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్ఎం కట్కూరి ముకేశ్ కోరారు. మంగళవారం సనుగులలో ఉపాధ్యాయులు ముందస్తుగా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ ఉపాధ్యాయులు మేకల పద్మ, కోరెపు శ్రీనివాస్, న్యాతరి నాగమణి, చింతల హరిప్ష్మ, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

రుద్రంగి, ఏప్రిల్ 15: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తూ, వారి సమస్యల పరిష్కరానికి కృషి చేస్తున్నామని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం పేర్కొన్నారు. రైతు పొలం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో విద్యుత్ వినియోగం, సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇక్కడ సెస్ ఎఈ కుమారస్వామి, వేములవాడ ఏఏవో జగదీష్, నాయకులు గంగం మహేశ్, కేసీరెడ్డి నర్సారెడ్డి, లావుడ్య మోహన్, సనుగుల గంగాధర్, సామ గంగారెడ్డి, నర్సయ్య, బక్కయ్య ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మలను నరికేస్తున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ పృథ్వీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు పోతిరెడ్డిపల్లి, నారాయణపూర్, దుమాలలో ఉదయం 7.30నుంచి నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15: యువత వ్యసనాలకు దూరంగా ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ సూచించారు. మంగళవారం వెంకట్రావుపల్లిలో గ్రామస్తులకు పలు అంశాల పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్100కి కాల్ చేయాలని సూచించారు.

వేతనాలు చెల్లించాలని స్కావెంజర్స్ ధర్నా

కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఎనిమిది నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే స్వీపర్స్, స్కావెంజర్స్ కార్మికులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతిపత్రం సమర్పించారు. ఇక్కడ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, తదితరులు ఉన్నారు.

వట్టెంలలో పోషణపక్షం పక్వాడా

వేములవాడ రూరల్, ఏప్రిల్ 15: వట్టెంల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్ష ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇక్కడ హెచ్ఎం ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, భాగ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.

రుద్రవరం ఆరోగ్య కేంద్రం తనిఖీ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 15: రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య ఆయుష్ మందిర్‌ను జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, మందులను పరిశీలించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కొనుగోళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, ఏప్రిల్ 15: జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోలు పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సీజన్‌లో జిల్లాలో 240కొనుగోలు కేంద్రాలకు గానూ ఇప్పటి వరకు మొత్తం 148 కేంద్రాలను ప్రారంభించామని, మరో రెండురోజుల వ్యవధిలో మిగిలిన 92 కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం వెంటనే సేకరించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, డీఏవో అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు కార్యాచరణ

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 3,500 చొప్పున మొత్తం ఏడు వేల ఇండ్లు మొదటి విడుత నిర్మిస్తున్నామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలాలు ఎంపిక చేసిన గ్రామాల్లో కొన్ని ఇండ్లు మంజూరు చేశామని, మిగతావి మంజూరు చేసేందుకు అలాట్మెంట్ తయారు చేయాలన్నారు. సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, పీడీ హౌసింగ్ శంకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జడ్పీసీఈవో వినోద్‌కుమార్, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, అప్రోచ్ రోడ్లపై ప్రమాదాలు జరుగకుండా రబ్బర్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ చంద్రయ్య, ఆర్ అండ్‌బీ ఈఈ వెంకటరమణయ్య, జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్లు, సమ్మయ్య, పీఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో రజిత పాల్గొన్నారు.

యూనిట్ల గ్రౌండింగ్‌కు సహకరించాలి

రాజీవ్ యువవికాసం పథకం కింద నిరుద్యోగ యువతీ యువకులతో వివిధ వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్‌కు బ్యాంకర్లు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం రాజీవ్ యువ వికాసంపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, బ్యాంకర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను మండలాలు, మున్సిపాలిటీలలో ప్రత్యేక బృందాలను బ్యాంకర్లతో కలిసి ఏర్పాటు చేసి స్క్రూటిని చేయాలన్నారు. అర్హుల జాబితాను ఎంపిక చేసి జిల్లాకు పంపాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో తుది జాబితా రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, మండల ప్రత్యేకాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫుల్లుగా వేసి.. కారును ఢీకొట్టి..

- వేములవాడలో ఆగిఉన్న వాహనాన్ని ఢీకొట్టిన అటవీశాఖ అధికారులు
- మద్యం తాగి ఉన్నారని స్థానికుల వెల్లడి

వేములవాడలో ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద నిలిపిన ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టిన ఫారెస్ట్ అధికారుల కారు

వేములవాడ, ఏప్రిల్ 15: వారు అటవీశాఖ ఉన్నతాధికారులు.. ఆ పైగా తనిఖీకి వెళ్లి వస్తు ఫుల్లుగా మందేసి ఉన్నారు.. ఇంకేముంది ఆగిఉన్న వాహనాన్ని ఢీకొట్టారు. వేములవాడ పట్టణంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని వాసుదేవ టవర్స్ ఎదుట బ్యాంకు పని నిమిత్తం వచ్చిన అల్లాడి రమేశ్ తన ఇన్నోవా వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి లోనికి వెళ్లారు. ఇంతలోనే ప్రైవేట్ వాహనంలో వచ్చిన అటవీశాఖ అధికారులు ఎడమ వైపు ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. పెద్ద శబ్దం రావడంతో ఒక్కసారిగా అక్కడికి ప్రజలు చేరుకోగా, వాహనంలో అటవీశాఖ అధికారులు ఉన్న విషయాన్ని గమనించారు. స్థానికులు హుటాహుటిన వీరిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లినట్లు సమాచారం. అయితే వాహనం నడుపుతున్న వ్యక్తి మద్యం తాగి ఉన్నాడని స్థానికుల ద్వారా తెలిసింది. వేములవాడ రేంజ్ అటవీశాఖ అధికారి కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సదరు ఇద్దరు ఉద్యోగులు తనిఖీకి వెళ్లి వస్తున్నట్లు తెలిసింది. ప్రమాదంలో అల్లాడి రమేశ్, అటవీశాఖ అధికారుల వాహనాలు భారీగానే డామేజ్ అయింది. ప్రాణప్రాయం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 15: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని కేడీసీసీబీ డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి, వేములవాడ ఏఎంసీ చైర్మన్ రొండి రాజు పేర్కొన్నారు. లింగంపల్లి, బొల్లారం, హన్మాజీపేట, మర్రిపల్లి, అచ్చనపల్లి, నమిలిగుండుపల్లి గ్రామాల్లో మంగళవారం సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజు, ఏవో వినీత, ఏఎంసీ డైరెక్టర్లు స్రవంతి, పరశురాములు, పీఏసీఎస్ డైరెక్టర్లు సంజీవరెడ్డి, సురేందర్‌రెడ్డి, సీఈవో లక్ష్మణ్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్‌గౌడ్, సంఘస్వామి, తిరుపతిరెడ్డి, వంగపల్లి మల్లేశం, ఎల్లాగౌడ్, ఆదిల్, ప్రవీణ్, మోహన్‌రెడ్డి, అంజయ్య, రాంరెడ్డి, దానే కొమురయ్య, దేవరాజు, తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట/ఇల్లంతకుంట రూరల్, ఏప్రిల్ 15: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇక్కడ మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దొంతి మల్లయ్య, ఏపీఎం వాణిశ్రీ, ఏఎంసి డైరెక్టర్లు వీరేశం, సురేందర్‌రెడ్డి, రాజేశం పాల్గొన్నారు.

కోనరావుపేట, ఏప్రిల్ 15: కనగర్తి, మామిడిపల్లిలో సింగిల్ విండో పరిధిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్యయాదవ్ ప్రారంభించారు. ఇక్కడ వైస్ చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు ముత్యాల కిషన్‌రెడ్డి, సాసాల మల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, నేతలు లింగారెడ్డి, నర్సయ్య, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 15: తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు మండెపల్లి, కస్బెకట్కూర్, గండిలచ్చపేటలో కొనుగోలు కేంద్రాలను సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూపరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఇక్కడ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, నేతలు పెద్దూరి తిరుపతి, వెలుముల తిరుపతిరెడ్డి, మచ్చ శ్రీనివాస్, ప్రశాంత్, ఏఎంసీ డైరెక్టర్లు ఉన్నారు.

వ్యాపారానికి అడ్డొస్తున్నాడనే హత్య

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి

హత్య కేసులో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, పక్కన సీఐలు

వేములవాడ, ఏప్రిల్ 15: గంజాయి వ్యాపారానికి అడ్డొస్తూ.. పోలీసులకు పట్టిస్తున్నాడని అనుమానంతో చెట్టిపల్లి పరశురామ్‌ను నిందితులు హత్య చేశారని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం హత్యకు గల వివరాలను వెల్లడించారు. వేములవాడకు చెందిన బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేశ్, అడ్డగట్ల మనోజ్‌కుమార్ స్నేహితులు. వీరందరిపై గంజాయి, హత్య, పలురకాల కేసులు ఉండగా, ఇదివరకే జైలుకు కూడా వెళ్లొచ్చారు. కొద్ది రోజులుగా ఐదుగురుపై గంజాయి కేసులు నమోదు కావడం తో పోలీసులకు పరశురామ్ సమాచారం ఇస్తున్నాడని అనుమానం పెంచుకున్నారు. ఎలాగైనా పరశురామ్‌ను చంపాలని భావించారు. ఈ క్రమంలో ఆదివారం మహాలింగేశ్వర గార్డెన్‌ఫంక్షన్ హాల్ వద్ద పరశురామ్ ఉన్నాడని తెలుసుకున్నారు. వెంటనే అక్కడికి చేరుకుని గొడ్డళ్లు, కత్తులతో బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్ విచక్షణ రహితంగా దాడి చేసి చంపాడు. రాజేశ్ బయట ఉండి ఎవరూ లోపలికి రాకుండా గేటు వేసి, కాపు కాశాడని తెలిపారు. అడ్డగట్ల మనోజ్ కుమార్ హత్యకు ప్రోత్సహించాడని చెప్పారు. పరశురామ్ భార్య ఫిర్యా దు మేరకు నిందితులు బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేశ్‌ను రిమాండ్‌కు తరలించగా, అడ్డగట్ల మనోజ్ పరారీలో ఉన్నాడని తెలిపారు. హత్యకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇక్కడ పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు రమేశ్, వెంకట్రాజం ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I. Neerati Haarika W/o. Vishnuprasad, H.No. 11-83, Racharla Boppapur, Yellareddypet Mandal. Rajanna Sircilla Dist. My Name was Changed to Gattipally Thirumala D/o.Naga Bhooshanam.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189